ముగిసిన డిప్యూటీ మేయర్ సియోల్ పర్యటన



లాలాపేట: సౌత్ కొరియా పర్యటనకు వెళ్లిన జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి పర్యటన ముగించుకుని శుక్రవారం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. మూసీ నదీ పునరుజ్జీవం ప్రాజెక్టు అధ్యయనం కోసం తెలంగాణ నుంచి మంత్రులు, మేయర్, డిప్యూటీ మేయర్‌లు పర్యటనకు వెళ్లిన బృందం సియోల్ నగరంలోని నదులపై అధ్యయనం చేసి వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్‌కు పలువురు ఘనంగా స్వాగతం పలికారు.

27న ఏఐటీయూసీ జిల్లా ప్రథమ మహాసభ

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రథమ మహాసభను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంచార్జి బెజ్యాల కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ గాంధీనగర్‌లోని ఏఐటియుసి కార్యాలయంలో ఈ సభ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

ఓయూలో జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా వీసీ ప్రొ. కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు.

రోడ్‌పై నజర్

రహదారుల ఆధునీకరణకు కార్యాచరణ

ప్రధాన రహదారుల ఆధునీకరణ, ట్రాఫిక్ సమస్యల నివారణకు జీహెచ్ఎంసీ ఉత్తర మండలం (సికింద్రాబాద్) జోనల్ కార్యాలయ అధికారులు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. విద్యుత్, ట్రాఫిక్ పోలీస్, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులను సమన్వయం చేస్తూ రహదారుల సుందరీకరణ, విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు 'కన్వర్‌జెన్స్' కమిటీలు వేసి నెలసరి సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. అన్ని విభాగాల అధికారులతో ఈ నెల రెండవ వారంలో తాజా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసుకున్న జీహెచ్ఎంసీ అధికారులు నవంబర్ మొదటివారంలో ప్రారంభించేందుకు సమాయత్తం అవుతున్నారు. –సికింద్రాబాద్



ట్రాఫిక్ జీబ్రా లైన్లతో సుందరీకరించనున్న చిలకలగూడ కూడలి

- 'కన్వర్‌జెన్స్' సమావేశాలతో ముందుకు
- జీహెచ్ఎంసీ జోనల్ అధికారుల కసరత్తు

ఉత్తరమండలం పరిధిలో సికింద్రాబాద్, బేగంపేట, మల్కాజిగిరి, ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా సర్కిళ్ల పరిధిలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో జలమండలి, ట్రాఫిక్‌పోలీస్, విద్యుత్ అధికారులను భాగస్వాములను చేస్తున్నారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రహదారుల్లోని సమస్యలను సమావేశాల్లో చర్చించి, ఆపై నెలలో పరిష్కరించాలని వివిధ విభాగాల అధికారులకు జోనల్ కమిషనర్ మార్గనిర్దేశనం చేశారు.

ప్రధాన సమస్యలు ఇవీ!

కన్వర్‌జెన్స్ సమావేశాల్లో రహదారుల్లో చర్చించాల్సిన అంశాల గురించి ఎజెండా సిద్ధం చేసుకున్నారు. అపరిశుభ్ర పరిస్థితులు, మురుగునీటి నిల్వలు, మట్టికుప్పలు పేరుకుపోవడం, రహదారుల విస్తరణ, ఆక్రమణలు, ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్న విద్యుత్ స్తంభాలు, చెట్లు తదితర అంశాలను సర్కిళ్ల వారిగా గుర్తించి చర్చిస్తారు. ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసుల నుంచి ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్న కారణాలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఆయా విభాగాల అధికారులు చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఒక నెల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు తదుపరి నెలలో జరిగే సమావేశం లోపు పూర్తిచేయాలని నిర్ణయించుకున్నారు.

అక్టోబర్ ప్రణాళికలో కొన్ని..

- అక్టోబర్ మొదటి వారంలో ఐదు సర్కిల్ కార్యాలయాల పరిధిలో తీసుకోవాల్సిన చర్యల గురించి జోనల్ కార్యాలయ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.
- మారేడుపల్లి షెనాయ్ నర్సింగ్ హోం, బేగంపేట ట్రాఫిక్ పీఎస్, బోయిన్‌పల్లి, అంబర్‌పేట్ చే నంబర్ ప్రాంతాల్లోని బస్‌షెల్టర్ల సమస్యలు అధ్యయనం చేయటం, శిథిలావస్థకు చేరినవి తొలగించి కొత్తవి ఏర్పాటు చేయడం.
- పాటిగడ్డ నుంచి పీవీ మార్గ్ లింక్ రోడ్డును అభివృద్ధి చేయడం. ప్యాట్నీ సెంటర్ రోడ్డు విస్తరణ పూర్తి చేయడం, ఆర్‌పీ రోడ్డు నుంచి కర్బలా మైదానం వరకు ఆక్రమణలు తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయడం.
- గాంధీసుపత్రి ఫుట్‌పాత్‌లు ఆధునీకరించడం, మెట్రో పిల్లర్లకు గ్రిల్స్ ఏర్పాటు చేయడం. ఆసుపత్రి పరిసరాల్లో మట్టికుప్పలు తొలగించి ఆరోగ్యకర వాతావరణం ఏర్పాటు చేయడం.
- రాణిగంజ్ బాంబే హోటల్ జంక్షన్, మెట్టుగూడ ఆలుగడ్డబావి జంక్షన్‌ల వద్ద రహదారులపై నీటినిల్వలు తొలగించి ట్రాఫిక్ సమస్యలు తొలగించడం.
- హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 9, ముసారాంబాగ్ తహసీల్దార్ కార్యాలయం లైన్‌లో రహదారుల ఆక్రమణలు తొలగించడం, స్పీడ్ బ్రేకర్ల ఎత్తుపల్లాల సమస్యలు తొలగించడం వంటి చర్యలు తీసుకునేందుకు జీహెచ్ఎంసీ అధికారులు నిర్ణయించారు.

సమూహ చర్చలతో సమస్యలకు పరిష్కారం



ప్రధాన రహదారులపై సమస్యలు సరిష్కరించడం, సుందరీకరించడం ఆపై ట్రాఫిక్ సమస్యలు తొలగించడమే కన్వర్‌జెన్స్ సమావేశాల ప్రధాన ఎజెండా. అన్నిభాగాల అధికారులను ఒకే వేదిక మీదకు తెచ్చి సమన్వయంతో సమస్యలకు పరిష్కారమార్గం చూపేందుకు కసరత్తు చేస్తున్నాం. క్రమేణా జోనల్ పరిధిలోని అన్ని ప్రధాన రహదారులపై ఇబ్బందులు, సమస్యలు తొలగించేందుకు కన్వర్‌జెన్స్ సమావేశాలతో అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ఎస్.రవికిరణ్, జీహెచ్ఎంసీ జడ్‌సీ

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: కుందన్‌బాగ్, బేగంపేట, లోధా, బల్కంపేట్, ఈఎస్ఐ, మైత్రివనం, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు అమృతామాల్, జీఎస్ మాల్, ఐసీఐసీఐ బ్యాంక్, జయాగార్డెన్, ఉదయం 10 నుంచి 10.30 వరకు ఎల్లమ్మ టెంపుల్ ఏరియా, బల్కంపేట్, సాయిబాబా టెంపుల్, రేణుకానగర్, డీఎస్ఎంకాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్ఆర్‌టీ పార్ట్, టీవీఎస్ షోరూంలేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డి–మార్ట్ ఎదురు ప్రాంతం, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, అల్లావుద్దీన్ కోఠి, లిక్కర్ కంపెనీ, ఇందిరాగాంధీపురం, బేగంపేట బస్తీ, కట్టమైసమ్మ టెంపుల్ లేన్, హెచ్‌పీఎస్ మెయిన్‌రోడ్డు, శివం పెట్రోల్ పంప్, శ్యాంలాల్‌బిల్డింగ్స్ ఏరియా, మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు ప్రశాంత్ కాలనీ, బల్కంపేట్, బీకేగూడ మసీదు, ఈఎస్ఐ స్టాఫ్ క్వార్టర్స్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు గాయత్రీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో...)టమాటా.39, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 35, బెండకాయ 60, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 75, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 38, పందిరి బీర 55, క్యాబేజీ 25, క్యారెట్ 47, దొండ 40, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 80, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 35, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 37, చామగడ్డ 43, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 19, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

భారత నౌకాదళానికి ఎంపికైన ఎన్‌సీసీ కేడెట్లు



ఎయిర్ స్క్వాడ్రన్ సాగర్ మిశ్రా
అగ్నివీర్ ద్వారా నౌకాదళానికి ఎంపికైన నిచిత, ప్రవీణ్

రసూల్‌పురా: ఎన్‌సీసీ హైదరాబాద్ గ్రూప్‌నకు చెందిన ముగ్గురు కేడెట్లు భారత నౌకాదళానికి ఎంపికయ్యారు. ఎన్‌సీసీ 1వ తెలంగాణ ఎయిర్ స్క్వాడ్రన్‌కు చెందిన సాగర్ మిశ్రా నౌకాదళ అధికారిగా.. 3వ బెటాలియన్‌కు చెందిన కేడెట్లు నిచిత, ప్రవీణ్‌లు అగ్నివీర్ ద్వారా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్, జనరల్ ఎయిర్ కమోడోర్ వీఎం.రెడ్డి, ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్ కుమార్ వారిని అభినందించారు.

ఎరుకలబస్తీలో ఫ్లోరింగ్ పనుల పరిశీలన

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ ఎరుకలబస్తీలో రూ. 7లక్షల వ్యయంతో చేపట్టిన ఫ్లోరింగ్ పనులను జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్‌తో కలిసి కార్పొరేటర్ సామల హేమ శుక్రవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

సీతాఫల్‌మండి హిందు శ్మశానవాటిక పరిశుభ్రం

దీపావళి అమావాస్య సందర్భంగా పరమపదించిన పెద్దలకు పూజించేందుకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సీతాఫల్‌మండి హిందు శ్మశానవాటికను సుమారు రూ. 3లక్షల వ్యయంతో పరిశుభ్రం చేయించినట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. శ్మశానవాటికలో చెత్తచెదారాలు, ముళ్ల చెట్లను తొలగించే పనులను ఆమె పరిశీలించారు.



శ్మశానవాటిక పరిశుభ్ర పనులను పరిశీలిస్తున్న దృశ్యం

మత్తు ఇంజెక్షన్లు సరఫరా చేస్తున్న పెడ్లర్ అరెస్టు

పంజగుట్ట: నిషేధిత పెంటాజోన్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర పెడ్లర్‌తో పాటు వినియోగదారులను పంజగుట్ట పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో విభాగం పోలీసులు కలిసి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం, పాట్నాకు చెందిన విజయ్ కుమార్ గుప్తా అక్కడే ఓ మందుల షాపులో పని చేస్తున్నాడు. పెంటాజోన్ ఇంజెక్షన్ల కోసం ఎంత ధర అయినా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు గమనించాడు. ఈ క్రమంలో భూత్‌నాథ్ రోడ్డులో ఎలాంటి లైసెన్స్ లేకుండా సరస్వతి ఎంటర్‌ప్రైజెస్, ఫార్మా డిస్ట్రిబ్యూటర్ పేరుతో సొంత కంపెనీ ప్రారంభించారు. అక్కడే ఓ ఆసుపత్రిలో పని చేస్తున్న విజయ్‌కుమార్‌తో స్నేహం చేసి అతని ద్వారా పెంటాజోసిన్ ఇంజెక్షన్లు తయారీ యూనిట్‌ను సంప్రదించి విజయ్‌కుమార్ పనిచేసే ఆసుపత్రి పేరుతో ఇంజెక్షన్లు ఆర్డర్ ఇచ్చారు. ఆసుపత్రి యాజమాన్యానికి తెలియకుండా అందులో పనిచేసే విజయ్‌కుమార్ సహకారంతో ఆసుపత్రి పేరుతో ఆర్డర్ ఇచ్చి వినియోగదారులకు అధిక ధరలకు నిషేధిత ఇంజక్షన్లను వీరు సరఫరా చేస్తున్నారు. వచ్చిన లాభాన్ని విజయ్ కుమార్ గుప్త, విజయ్ కుమార్ ఇద్దరూ పంచుకునేవారు. ఈ ఇంజెక్షన్ల గూర్చి తెలుసుకున్న యూసూఫ్‌గూడ, కృష్ణానగర్‌లో నివసించే మొహమ్మద్ నయీంఉద్దీన్ విజయ్‌కుమార్ గుప్తను సంప్రదించి అవసరం ఉన్నవారికి ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. నిందితుల కదలికలు తెలుసుకున్న పంజగుట్ట, తెలంగాణ యాంటీ నార్కోటిక్ పోలీసులు మొహమ్మద్ నయీంను అదుపులోకి తీసుకుని ఇతని సమాచారంతో పాట్నాకు వెళ్లి విజయ్‌కుమార్ గుప్తను అదుపులోకి తీసుకున్నారు. ఇతనికి సహకరించిన విజయ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నగరంలో ఈ ఇంజక్షన్ వినియోగించిన ఐదుగురు వినియోగదారులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా రచయిత కాలేకూరి ప్రసాద్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: రచయిత, దళిత ఉద్యమకారుడు, అంబేడ్కర్, మార్క్సిస్టు భావజాలం గల కాలేకూరి ప్రసాద్ 62వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఓయూ అధ్యక్షులు నామా సైదులు తదితరులు ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఆజాద్, నెల్లి సత్య, శ్రీకాంత్, వలిగొండ నరసింహ, సుమంత్‌లాళ అజయ్, కోటేష్, వంశీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక నొప్పలకు ఆధునిక చికిత్స

రాంగోపాల్‌పేట్: దీర్ఘకాలికమైన తీవ్రమైన నొప్పుల నివారణకు ఆధునిక పద్ధతుల ద్వారా చికిత్స అందించి నొప్పులను తగ్గించవచ్చని కిమ్స్ ఆస్పత్రి పెయిన్ ఫిజీషియన్ డాక్టర్ నాగలక్ష్మి పట్నాల అన్నారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెయిన్ మెడిసిన్ అండ్ ఎనస్తీషియాలజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సదస్సును కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎనస్తీషియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ నరేష్ కుమార్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. వెన్నునొప్పి, న్యూరోపతి నొప్పి, కేన్సర్ నొప్పి లాంటి దీర్ఘకాలిక సమస్యలు సాంప్రదాయ వైద్యంతో తగ్గవని వాటిని పెర్క్యూటినియస్ చికిత్సతో సమర్థవంతంగా నయం చేయవచ్చన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

లాలాపేట: తార్నాకలోని ఇరిసెట్‌లో ఈ నెల 14 నుంచి కొనసాగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం(ఎఫ్‌డీపీ)శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరద్‌కుమార్ శ్రీవాత్సవ పాల్గొని ప్రసంగించారు. రైల్వే ప్రమాదాల నివారణలో కవచ్ ప్రాముఖ్యతపై మాట్లాడుతూ సాంకేతిక జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్ఐటి వరంగల్, ఎంబిఎంయుటి జోద్‌పూర్,ఠాకూర్ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు హైదరాబాద్, విశాఖపట్నం, ముంబై తదితర ప్రాంతాలలోని 10 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 30 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శ్రీవాత్సవ

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కులగణన నిర్వహించి బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని బీసీ నేత లింగం గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ కమీషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతి పత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. సమగ్ర కులగణన పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం కల్పించి పల్లె నుంచి పట్నం వరకు చేరుకునేలా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ నెల 28 నుంచి చేపట్టిన బీసీ కమీషన్ క్షేత్రస్థాయి బీసీ కులాల అధ్యాయానికి అన్ని సంఘాలు సంపూర్ణంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిలి వెంకన్నగౌడ్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గయ్య, మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణి మంజరి, ఉపాధ్యక్షురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

హాకా ఆధ్వర్యంలో టపాకాయల విక్రయం

లిబర్టీ: గత 43 సంవత్సరాలుగా జంటనగరాల వినియోగదారులకు విశేషమైన సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ హాకా (ది హైదరాబాద్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ అసోసియేషన్) ఈ ఏడాది కూడా దీపావళి పండుగను పురస్కరించుకొని టపాకాయల ద్వారా సేవలు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శివకాశి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన నాణ్యమైన టపాకాయలను ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రతి ఏడాది వలే ఇందిరాపార్కు ఎదురుగా ఉన్న ఎన్‌టీఆర్ స్టేడియంలో 10 స్టాల్స్ ఏర్పాటు చేసి, అనుభవజ్ఞులైన సిబ్బందితో అన్ని రకాల దీపావళి టపాకాయలను విక్రయిస్తున్నామని హాకా ఎండీ కె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులకు సేవే లక్ష్యంగా ఎక్కువగా లాభాపేక్ష లేకుండా తక్కువ ధరలకు అందిస్తామన్నారు. పార్కింగ్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తున్నామని, అగ్నిమాపక కేంద్రం, పోలీసుల నియమ, నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

కళాసీగూడలో నేడు ఉచిత వైద్య శిబిరం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ కళాసీగూడలో ఈనెల 26న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మక్తల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జలంధర్‌గౌడ్ తెలిపారు. కళాసీగూడ కమ్యూనిటీ హాలులో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కిమ్స్ ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్, గైనిక్, పిడియాట్రిక్, డెంటల్, కంటి, జనరల్ ఫిజీషియన్ తదితర వైద్యులు హాజరవుతున్నారని చెప్పారు. ఉదయం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని పారంభిస్తారని తెలిపారు.

కోచింగ్‌కు వచ్చిన విద్యార్థి మృతి

అమీర్‌పేట: బంగ్లాదేశ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసి నగరంలో మెడికల్ కోర్సు చేస్తున్న ఓ యువతి మృతి చెందింది. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. కర్నాటక రాష్ట్రం హుబ్లీకి చెందిన ఎస్.సోమాసింగ్ ఎల్ఐసీ ఉద్యోగి కూతురు నేహా పవార్ (26) బంగ్లాదేశ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఎఫ్ఎంజీఈ కోర్సు చేసేందుకు నగరానికి వచ్చి అమీర్‌పేటలోని వీవీకే హాస్టల్‌లో ఉంటోంది. లాల్‌బంగ్లా వద్ద గల మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కోచింగ్ సెంటర్‌లో చేరిన నేహా ఈనెల 23న సాయంత్రం హాస్టల్ వద్ద కిందపడిపోయింది. స్థానికులు సమీపంలోని ప్రైయివేటు ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

వృద్ధురాలి గొలుసు లాక్కుని పరార్

అమీర్‌పేట: కాలనీలో వాకింగ్ చేస్తున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఓ అగంతకుడు లాక్కుని పరారయ్యాడు. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు..సనత్‌నగర్ జెక్ కాలనీ స్ట్రీట్ నెంబర్–2లో ఉండే ఎ.కృష్ణకుమారి (65) గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో కాలనీ రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా యాక్టీవా ద్విచక్ర వాహనంపై వచ్చిన అగంతకుడు ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును లాక్కున్నారు. అరుపులు కేకలు వేయడాన్ని గమనించిన స్థానికులు తేరుకునే లోపే పారిపోయాడు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

నో క్లూ!

వీడని జంట హత్యల మిస్టరీ



- పోలీసులకు సవాల్‌గా మారిన కేసు
- పదికి పైగా పోలీసు బృందాల వేట
- వారమైనా దొరకని ఆధారాలు
- దర్యాప్తులో తీవ్ర గోప్యత పాటిస్తున్న పోలీసులు



హత్యకు గురైన దంపతులు (ఫైల్)

అంబర్‌పేట: డీడీ కాలనీ సాయిబాబానగర్ జంట హత్యల కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. వారమైనా రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ లింగారెడ్డి మర్డర్ కేసు మిస్టరీ వీడటం లేదు. హత్య జరిగినప్పటి నుంచి పోలీసులు ఎన్ని కోణాల్లో దర్యాప్తు చేసినా చిన్న క్లూ దొరకడం లేదు. పది బృందాలు వందకు పైగా పోలీసులు వారం రోజులుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 10వేల సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇంకా పరిశీలిస్తునే ఉన్నారు. అయినా వృద్ధ దంపతులు హత్య కేసును చేధించడంలో పోలీసులకు అనేక సవాళ్లు ఎదురువుతున్నాయి. ఎంతో అనుభవం ఉన్న పోలీసు అధికారులకు సైతం ఈ హత్య కేసు అంతుచిక్కడం లేదు. 24 గంటలు టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, లా అండ్ ఆర్డర్ పోలీసులు బృందాలుగా ఏర్పడి కేసు చేధించేందుకు శ్రమ పడుతున్నా కొలిక్కి రాకపోవడం గమనార్హం.

మిస్టరీ ఎందుకు వీడటం లేదు.?

- 30 ఏళ్లుగా సొంత ఇంట్లో ప్రశాంత జీవనం గడుపుతున్న లింగారెడ్డి, భార్య ఊర్మిళదేవి దంపతులకు ముగ్గురు కూతుళ్లు. ఇద్దరు అమెరికాలో ఉన్నప్పటికి పెద్ద కూతురు సైతం అమెరికాలోనే ఉంది. ఇంట్లో వీరిద్దరు తప్ప సంబంధికులు ఎవరూ లేకపోవడం కేసుకు అవరోధంగా మారింది. అలాగే వీరి ఇంట్లో సీసీ కెమెరాలు లేకపోవడం పోలీసులకు క్లిష్టంగా మారింది. చుట్టుపక్కల సీసీటీవీ కెమెరాలు ఉన్నప్పటికీ వీరు ఉంటున్న ఇంటిని ఆ సీసీ కెమెరాలు కవర్ చేయడం లేదు. మొదట చోరీ కోసం హత్య జరిగిందని భావించిన పోలీసులు ఆ దిశగానే దర్యాప్తు చేశారు.

మొదట దొంగల పనే అనుకున్నారు కానీ..

- కాగా విషయం తెలుసుకొని అమెరికా నుంచి వచ్చిన కూతుళ్లను విచారించగా ఇంట్లో సొత్తు పూర్తిగా చోరీ కాలేదని తెలుస్తోంది. దీంతో పోలీసులు మరో కోణంలో దర్యాప్తు చేపట్టాల్సి వస్తోంది. చిల్లర దొంగలు కేవలం చోరీ కోసమే హత్య జరిగితే ఈపాటికి పోలీసులకు పట్టుబడేవాళ్లని అంతా భావిస్తున్నారు. ఎవరో తెలిసిన వారే ఈ హత్యలు చేశారని అనుమానిస్తున్నప్పటికీ పోలీసులు ఎవరిని ఎలా విచారించాలనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. హత్యకు గురైన దంపతులకు ఉన్నత శ్రేణి సంబంధాలు ఉండటంతో పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ కేసు అంతు చిక్కడం లేదు.

ఇంకా షాక్‌లోనే కాలనీవాసులు..

- నిత్యం కళ్లముందు ఉండే దంపతులు దుండగుల చేతిలో హత్యకు గురవడంతో చుట్టు పక్కల వారు ఆందోళనకు గురవుతున్నారు. సాయిబాబానగర్ వాసులు ఇంకా షాక్‌లోనే ఉన్నారు. హత్యకు గల కారణాలు తెలియకపోవడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు. పదుల సంఖ్యలో పోలీసులు ఆ ఇంటి పరిసరాల్లో విచారిస్తున్నా కేసు కొలిక్కి రాకపోవడంతో స్థానికులు భయపడుతున్నారు.

అనుమతుల్లేని సైరన్లపై స్పెషల్ డ్రైవ్

15 సైరన్లు, 12 మల్టీ టోన్డ్ హారన్లను సీజ్... కేసులు నమోదు

ఖైరతాబాద్: సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు గతరెండు రోజులుగా వాహనాలకు ఎలాంటి అనుమతులు లేకుండా ఉపయోగిస్తున్న 15 సైరన్లు, 12 మల్టీ టోన్డ్ హారన్స్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపారు. ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ మహ్మద్ మాజిద్ నేతృత్వంలో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రవీంద్రభారతి, రోటరీ చౌరస్తా, ఎన్టీఆర్‌మార్గ్ ప్రాంతాల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వీఐపీ సైరన్లు, మల్టీ టోన్డ్ హారన్లను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో సైఫాబాద్ ట్రాఫిక్ ఎస్ఐ వినయ్ కుమార్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ మహ్మద్ మాజిద్ తదితరులు

మహిళా పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం

వీ–హబ్ సీఈఓ సీత పళ్లచోల్ల

బంజారాహిల్స్: మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి వారికి వ్యాపార అవకాశాలను మెరుగుపరచడమే వీ–హబ్ లక్ష్యమని ఆ సంస్థ సీఈఓ సీత పళ్లచోల్ల స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న నూతన మహిళా పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ చేయూతను అందిస్తామని చెప్పారు. కొత్తగా వ్యాపారం చేయాలనుకునే మహిళలకు వారి వద్ద ఉన్న సరికొత్త ఆలోచనలను తమకు తెలియజేస్తే వారికి సంపూర్ణ సహకారం అందజేస్తామన్నారు. వ్యాపారంలో ఎలా నిలదొక్కుకోవాలి, బ్యాంక్ రుణాలు తదితర అంశాల్లో సంపూర్ణ మద్దతు ఇవ్వనున్నట్లు చెప్పారు.

అప్పుల బాధతో భార్యాభర్తల అదృశ్యం



అమరేందర్ సబిత

బౌద్ధనగర్: అప్పులు పెరిగిపోవడం, చిట్టీల్లో నష్టాలు రావడంతో భార్యాభర్తలు ఇద్దరూ అదృశ్యమైన ఘటన వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గంగపుత్రకాలనీ బాపూజీనగర్‌కు చెందిన చిన్నాల అమరేందర్ (53), చిన్నాల సబిత (49)లు భార్యాభర్తలు. అమరేందర్ కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో హెడ్ వార్డెన్‌గా పనిచేస్తూ చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గత కొద్ది రోజుల నుంచి చిట్టీల వ్యాపారంలో నష్టాలు రావడం, అప్పులు పెరిగిపోయాయి. దీంతో అప్పులు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి తీసుకుని వస్తుండటంతో ఈ నెల 14న ఇంటి దగ్గర నుంచి అదృశ్యమయ్యారు. తెలిసిన వారు, బంధువుల వద్ద వాకబు చేసినా ఎక్కడ కనిపించ లేదు. దీంతో ఆయన సోదరుడు రఘుపతి వారాసీగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన భార్యాభర్తల ఆచూకీ తెలిస్తే వారాసీగూడ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.